సాక్షి
కర్నూలు
ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



కేసీకి 1,225 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శనివారం 1,225 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్‌కు ఎగువ నుంచి 640 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.



నేడు 'ఎస్‌ఐ' ప్రాథమిక పరీక్ష

పోలీసు శాఖలో ఎస్‌ఐ ఉద్యోగాల భర్తీకి ఆదివారం 39 కేంద్రాల్లో ప్రాథమిక పరీక్ష నిర్వహించనున్నారు. మొత్తం 19,800 మంది పరీక్షకు హాజరుకానున్నారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,610.07
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:37.705
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,762

న్యూస్‌రీల్

శ్రీ మఠంలో హైకోర్టు జడ్జీలు



పీఠాధిపతితో న్యాయమూర్తులు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక హైకోర్టు జడ్జి శ్రీరామచంద్ర, తెలంగాణ హైకోర్టు జడ్జి నాగార్జున వేర్వేరు సమయాల్లో మంత్రాలయం వచ్చారు. శనివారం రాత్రి వారు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీ మఠంలో నిర్వహించే రథోత్సవ సేవలో పాల్గొన్నారు. శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫలమంత్రాక్షింతలిచ్చి ఆశీర్వదించారు.

అహోబిలేశుడికి విశేష పూజలు



స్వామి వారిని దర్శించుకుంటున్న అహోబిలం మఠం పీఠాధిపతి

రుద్రవరం: పార్వేటోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులైన శ్రీ జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాదవరద స్వామి వారి పల్లకీ శనివారం టి.లింగందిన్నె చేరుకుంది. ఆనవాయితీలో భాగంగా అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీరంగనాథ యతీంద్ర మహదేశికన్ ప్రత్యేక వాహనంలో గ్రామానికి చేరుకొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. అహోబిల ఆలయం నుంచి ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, అర్చక బృందం తదితరులు అహోబిలం నుంచి నైవేద్యం తీసుకువచ్చి స్వామి వారికి సమర్పించారు.

ఇనాఫ్ ట్యాగింగ్ తర్వాతే వ్యాక్సినేషన్

కర్నూలు(అగ్రికల్చర్): గొర్రెలు, మేకలకు ఇనాఫ్ ట్యాగింగ్ చేసిన తర్వాతనే పీపీఆర్ వ్యాక్సిన్ వేసే విధంగా పశుసంవర్ధకశాఖ చర్యలు చేపట్టింది. జిల్లాకు పీపీఆర్ వ్యాక్సిన్ 12.42 లక్షల డోసులు వచ్చింది. ఈ నెల 1వ తేదీ నుంచి గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం మొదలైంది. నెలాఖరిలోపు పూర్తి చేసే విధంగా పశుసంవర్ధకశాఖ చర్యలు చేపట్టింది. ఇనాఫ్ ట్యాగింగ్ చేసిన తర్వాతనే టీకా వేయాల్సి ఉండటంతో ఈ కార్యక్రమం నెమ్మదిగా నడుస్తోంది. ఇప్పటి వరకు 30 నుంచి 40 శాతం వరకే వ్యాక్సిన్ వేసినట్లు తెలుస్తోంది.

విత్తన పొట్టేళ్లకు బ్రూసెల్లోసిస్ పరీక్షలు

కర్నూలు(అగ్రికల్చర్): విత్తన పొట్టేళ్లు, మేకపోతులకు బ్రూసెల్లోసిస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు శనివారం విలేకరులకు తెలిపారు. జిల్లాలో 25 లక్షల జీవాలు ఉన్నాయని, ప్రతి 50 జీవాలకు ఒక విత్తన పొట్టేలు, మేకపోతు ఉంటుందన్నారు. ఇవి బలంగా ఉంటే వాటికి పుట్టే జీవాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయని పేర్కొన్నారు. వీటికి ప్రధానంగా బ్రూసెల్లోసిస్ వ్యాధి వస్తోందని, దీనిని నివారించేందుకు పరీక్షలు నిర్వహించే విధంగా పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలకు రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. పశువైద్యులు, పారా సిబ్బంది విత్తనపు పొట్టేళ్లు, మేకపోతల నుంచి రక్త నమూనాలు సేకరించి నియోజకవర్గాల వారీగా ఉన్న పశువ్యాధి నిర్ధారణ కేంద్రాల్లో అందచేయాలని సూచించారు.

భక్తుల గుండెల్లో పాగా



శనివారం అర్ధరాత్రి పాగాలంకరణ అనంతరం శ్రీశైల ఆలయం

శివరాత్రి వేళ ఇల కైలాసమైన శ్రీగిరిలో బ్రహ్మోత్సవ సంబరాలు అంగరంగ వైభవంగా సాగాయి. మది మదిలో మల్లన్నను స్మరిస్తుండగా.. అడుగడుగునా భక్తి భావం ఉప్పొంగగా.. దేదీప్యమానంగా ఆధ్యాత్మిక వెలుగులు విరాజిల్లుతుండగా.. ఉత్సవాలు నేత్రానుభరితంగా నిర్వహిస్తుండగా.. శ్రీశైల క్షేత్రం పులకించిపోయింది. నంది వాహనంపై విహరించిన మల్లన్న ఆతర్వాత పాగా కట్టుకుని పెళ్లి పీటలెక్కి భ్రామరీని వివాహమాడగా భక్తకోటి మురిసిపోయింది.

- శ్రీగిరిలో అంబరాన్నంటిన బ్రహ్మోత్సవ శోభ
- పాగాలంకరుడైన శ్రీశైల మల్లికార్జునుడు
- స్వామివారికి లింగోద్భవకాల మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం
- కనుల పండువగా ప్రభోత్సవం, నందివాహనసేవ

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శ్రీశైల మల్లికార్జునుడి వైభోగాన్ని చూసి భక్తజనం తరించిపోయింది. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు శనివారం లక్షలాది మంది భక్తజనం మధ్య నిర్వహించిన ప్రభోత్సవం, నందివాహనసేవ కనులపండువగా సాగాయి. సాయంత్రం అశేషభక్త జనం నడుమ ప్రభోత్సవం నిర్వహించారు. శివరాత్రి తర్వాతి రోజు జరిగే రథోత్సవ నిర్వహణకు వీలుగా ముందస్తుగా ప్రభోత్సవం జరుపుతారు. పుష్పాలతో అలంకరించిన ప్రభపై ఉత్సవమూర్తులను ఉంచి గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు ప్రభోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీభ్రమరాంబా సమేతుడైన మల్లికార్జునుడు నందివాహనంపై ఊరేగాడు. నందివాహనంపై కొలువైన ఆదిదంపతులను ఆలయ ప్రదక్షిణ ద్వారా ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో వివిధ జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

శ్రీశైలేశుడికి రుద్రాభిషేకం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాత్రి 10 గంటల నుంచి స్వామివారికి లింగోద్భవ కాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు. నిష్ణాతులైన 11 మంది అర్చకులు, వేద పండితులు మహాన్యాసపూర్వకంగా రుద్ర మంత్రాలను పఠిస్తుండగా జ్యోతిర్లింగ స్వరూపుడైన స్వామి వారికి అభిషేకం జరిపించారు. ఆలయ ప్రాంగణంలోని పవిత్రమైన మల్లికాగుండంలోని జలాలతో, పంచామృతాలతో, పలు ఫలోదకాలతో ఈ అభిషేకం నిర్వహించారు.



భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల కల్యాణోత్సవం

వైభవం.. బ్రహ్మోత్సవ కల్యాణం

రాత్రి 12 గంటల సమయంలో స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. స్వామివారు పాలతెలుపు వలె పట్టువస్త్రాన్ని ధరించి, తలపై ఒకవైపు గంగమ్మను, మరోవైపు నెల వంకను, మెడలో రుద్రాక్షమాలను, నుదుట విభూది రేఖలను, పట్టువస్త్రాలను ధరించి పెండ్లికుమారునిగా ముస్తాబు కాగా.. ముదురు ఎరుపు రంగు పట్టువస్త్రాలను ధరించి, నుదుట కల్యాణ తిలకాన్ని, బుగ్గన చుక్కను, సూర్యాభరణాలను ధరించిన భ్రమరాంబాదేవి పెళ్లి కూతురుగా ముస్తాబై వెండి పల్లకీలో పెండ్లి మండపానికి చేరుకున్నారు. పెళ్లి పీటలపై వధూవరులు ఆశీనులు కాగా ఆలయ అర్చకులు, వేదపండితులు బంధువర్గంగా నిలిచి వివాహం జరిపించారు. ఆయా కార్యక్రమంలో దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆలయ చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈఓ లవన్న, ధర్మకర్తల మండలి సభ్యులు మధుసూదన్‌రెడ్డి, హనుమంత్‌నాయక్, మఠం విరూపాక్షయ్య స్వామి, ధర్మరాజు, డా.కనకదుర్గ పాల్గొన్నారు.

పాగా చుట్టి.. వరుడిగా ముస్తాబు చేసి

లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ప్రారంభమైన వెంటనే మరోవైపు పాగాలంకరణ ప్రారంభమైంది. రాత్రి 10 గంటలకు ఆలయంలోని విద్యుత్ దీపాలను ఆరి వేయగా.. ప్రకాశం జిల్లా హస్తినాపురానికి చెందిన పృథ్వి వెంకటేశ్వర్లు దిగంబరుడై పాగాను అలంకరించారు. నియమ నిష్టలతో నేసిన 365 మూరల పొడవైన పాగాను గర్భాలయ విమాన శిఖరం నుంచి ముఖమండపంపై ఉండే నవనందులను అనుసంధానం చేస్తూ చుట్టాడు. పాగాలంకరణ జరుగుతున్నంత సేపు ఆలయంలో ఓంనమఃశివాయ అంటూ శివనామస్మరణ మారుమోగింది.



పాగాతో ఆలయ ప్రాంగణానికి చేరుకున్న పృథ్వీ వెంకటేశ్వర్లు

ప్రయోగం నాస్తి.. వసూళ్లు జాస్తి!

- ఈ నెల 20 నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్
- పరీక్షలు పాస్ చేయించేందుకు దొడ్డి దారి
- కొన్ని ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థుల నుంచి డబ్బు వసూలు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు



☛ కర్నూలు నగరంలోని ఓ కార్పొరేట్ కాలేజీలో ప్రాక్టికల్స్ పేరుతో ఎంపీసీ గ్రూప్ విద్యార్థుల నుంచి రూ.1,250, బైపీసీ గ్రూప్ విద్యార్థుల నుంచి రూ.2,000 వరకు వసూలు చేశారు. ఈ విషయంపై ఆ కాలేజీకి వెళ్లి అధికారులు విచారణ చేపట్టకముందే అధ్యాపకులతో విద్యార్థులను బెదిరించారు. ఎలాంటి వసూళ్లు చేయలేదని చెప్పించారు.

☛ ఓ ప్రైవేట్ కాలేజీకి చెందిన ప్రిన్సిపాల్ ప్రాక్టికల్స్‌లో 100 శాతం ఉత్తీర్ణతతో పాటు మంచి మార్కులు వేయిస్తామని విద్యార్థుల నుంచి ఒక్కో సబ్జెక్టుకు 500 రూపాయల చొప్పున వసూలు చేశారు. కాలేజీలోనే సెంటర్ ఉందని, ఇన్విజిలేటర్లుగా వచ్చిన వారికి కొంత ఇచ్చుకుంటే అనుకూలంగా వ్యవహరిస్తారని భరోసానిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

.. జిల్లాలో ఈ రెండు కాలేజీలే కాదు దాదాపు అన్ని ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో ఇదే తంతు నడుస్తోంది.

కర్నూలు సిటీ: ప్రాక్టికల్స్‌లో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ప్రతి ఏటా చెబుతున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. గతేడాది లాగే ఈసారి కూడా నాన్ జంబ్లింగ్‌లోనే పరీక్షలు జరగనున్నాయి. దీంతో ఆయా కళాశాలల యాజమాన్యాలు తమ కాలేజీల్లోనే కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 283 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు వొకేషనల్ విద్యార్థులకు, ఈ నెల 26 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. వొకేషనల్‌కు 51, రెగ్యులర్ కోర్సులకు 149 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులను ఫీజుల పేరుతో వేధింపులకు గురి చేస్తున్నట్లు ఇంటర్‌మీడియట్ బోర్డు అధికారులకు ఫిర్యాదులు సైతం వెళ్లాయి. ఫిర్యాదులు వచ్చిన కాలేజీలకు అధికారులు హెచ్చరికలతో సరిపెట్టేస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు బ్యూరేట్, పిప్పెట్ అంటే కూడా తెలియడం లేదంటే ప్రాక్టికల్స్ విద్యకు వారు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థమవుతోంది. ఆయా కాలేజీల్లో ఇంటర్‌మీడియట్ బోర్డు అధికారులు తనిఖీలకు వెళ్లినప్పుడు ల్యాబ్‌లు తెరిచి చూపి, ఆ వెంటనే మూత వేసి తాళం వేస్తున్నారు. ఈ విషయంపై అధికారులను ప్రశ్నిస్తే తమపై ఒత్తిళ్లు ఉన్నాయని చెబుతున్నారు.

ఫిర్యాదులు అందాయి

ప్రాక్టికల్స్ పేరుతో అదనంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారని కొందరు విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదు వచ్చిన కాలేజీల్లోకి వెళ్లి విద్యార్థులను అడిగితే వారు ఎలాంటి సమాధానం చెప్పడం లేదు. తల్లిదండ్రులు, విద్యార్థులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఆ కాలేజీల గుర్తింపు రద్దు చేయిస్తాం.

– గురవయ్యశెట్టి, ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి

మహానందీశ్వరుడికి మహా రుద్రాభిషేకం



నంది వాహనంపై విహరిస్తున్న కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరుడు

మహానంది: మహాశివరాత్రి సందర్భంగా స్వయంభువుగా వెలిసిన శ్రీ మహానందీశ్వరస్వామికి శనివారం అర్ధరాత్రి తర్వాత లింగోద్భవ కాలంలో మహారుద్రాభిషేకం నిర్వహించారు. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీబోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గంధ, చందనాలు, విశేష ద్రవ్యాలతో అభిషేకించారు. వేలాది సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ఓం నమఃశివాయ అంటూ భక్తిశ్రద్ధలతో ప్రణమిల్లారు. రుద్రాభిషేకం అనంతరం శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లకు కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లు శేషవాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి నందివాహనంపై ఊరేగారు. వేలాది సంఖ్యలో భక్తుల మధ్య నందివాహనంపై గ్రామోత్సవం కనులపండువగా సాగింది.

టీటీడీ తరపున పట్టువస్త్రాల సమర్పణ

ఉత్సవాల సందర్భంగా మహానందీశుడి కల్యాణోత్సవానికి టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. టీడీడీ జేఈఓ వీరబ్రహ్మం, బోర్డు సభ్యుడు మారుతి ప్రసాద్ దంపతులు శనివారం మహానందికి చేరుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. ట్రస్టీబోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

మద్దిలేటయ్య ఆదాయం రూ.3,38,102

బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహ స్వామిని దర్శించుకునేందుకు శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.3,38,102 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు.

దైవదర్శనానికి వెళ్తూ...

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి

పెద్దపప్పూరు: దైవదర్శనానికి వెళ్తున్న ఇద్దరు మహిళలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ప్యాపిలి గ్రామానికి చెందిన కుమ్మర నారాయణమ్మ (80) అనంతపురం జిల్లా గుత్తి మండలం జక్కలచెరువు గ్రామానికి చెందిన వాయల నారాయణమ్మ (50), ఆమె కూతురు భారతి, పామిడి మండలానికి చెందిన రామప్ప, లక్ష్మమ్మలు శనివారం మధ్యాహ్నం పెద్దపప్పూరులోని అశ్వత్థనారాయణస్వామి క్షేత్రంలో భీమలింగేశ్వరున్ని దర్శించుకుని, రాత్రికి అక్కడే జాగారం చేయాలని ఆటోలో బయల్దేరారు. పసలూరు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న నీళ్ల ఆటో వీరి ఆటోను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కుమ్మర నారాయణమ్మ, వాయల నారాయణమ్మ మృతి చెందారు. గాయపడిన భారతి, రామప్ప, లక్ష్మమ్మను 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేశాక అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న జేకే పంక్షన్ హాల్‌లో సోమవారం నుంచి ఈ నెల 26 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన ఉంటుందని ఉమ్మడి జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదర్శనకు రాష్ట్ర నలుమూలల నుంచి 25 నుంచి 30 వరకు చేనేత సహకార సంఘాలు పాల్గొంటాయని పేర్కొన్నారు. వస్త్రాలు సరసమైన ధరలకే లభిస్తాయని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చెట్టును ఢీకొన్న బైక్.. యువకుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పత్తికొండ రూరల్/కోసిగి: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో రాము(30) అనే యువకుడు శనివారం మృతి చెందాడు. సీఐ మురళీ మోహన్ తెలిపిన వివరాలు.. దూదేకొండ గ్రామంలోని బంధువుల తిరుగుపెళ్లికి వెళ్లి తెల్లవారుజామున కోసిగికి వచ్చేందుకు రాము బైక్‌పై బయలు దేరాడు. పత్తికొండ పట్టణ సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఉదయం దారివెంట వెళ్లే వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే రాము మృతి చెందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తల్లి మందలించిందని..



మృతి చెందిన అనిల్ (ఫైల్)

డోన్ రూరల్: చనుగొండ్ల గ్రామానికి 9వ తరగతి విద్యార్థి అనిల్(14) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పెద్దయ్య, సరస్వతి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్ద కుమారుడు అనిల్ తుగ్గలి మండలం పెండెకల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం అనిల్ పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లి మందలించింది. మనస్తాపం చెందిన విద్యార్థి గ్రామ సమీపంలోని వామిదొడ్డిలోకి వెళ్లి అక్కడ పురుగు మందు తాగి ఇంటికొచ్చి అపస్మారక స్థితిలో పడిపోవడంతో కుటుంబీకులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. రూరల్ పోలీస్‌లు కేసు నమోదు చేశారు.



కర్నూలులో ప్రత్యేక అలంకరణలో సాయి ఈశ్వరుడు



కర్నూలు కైలాసగిరి ఆలయం వద్ద భక్తుల సందడి



పత్తికొండ మండలం రాజులమండగిరిలో పూజలందుకున్న రామలింగేశ్వరుడు



జగన్నాథగట్టు రూపాల సంగమేశ్వరుడిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



నందవరం మండలంలోని నది తీరంలో ఇసుక లింగాలు చేసి మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

ఓం నమో..శివ రుద్రాయా!

శివనామ స్మరణతో శైవక్షేత్రాలు మారుమోగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం భోళా శంకరునికి పంచామృతాభిషేకాలు చేశారు. రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు నిర్వహించారు. భక్తులు జాగరణ చేస్తూ లింగాష్టకాన్ని, శివ పంచాక్షరి మంత్రాన్ని జపించారు. లింగోద్భవ ఘట్టం, శివపార్వతుల కల్యాణం, గ్రామోత్సవాలను వీక్షించారు. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. –సాక్షినెట్‌వర్క్



ఆలూరులో భీమలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



సి.బెళగల్ శివాలయంలో శివపార్వతులకు కల్యాణం చేస్తున్న దృశ్యం





వెల్దుర్తి మండలం బ్రహ్మగుండంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం, కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తజనం



ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రం



కొలిమిగుండ్ల మండలం పెట్నికోటలో కబడ్డీ పోటీలు



యాగంటిలో పూజలందుకున్న ఉమామహేశ్వరులు



శివుడికి అభిషేక హారతులు పడుతున్న శ్రీమఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు



సంగమేశ్వరంలో అలంకరించిన వేపదారు శివలింగం



భోగేశ్వరంలోని కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

శిరివెళ్ల: ఆళ్లగడ్డ– నంద్యాల జాతీయ రహదారిపై శిరివెళ్ల మెట్ట గ్యాస్ గోడౌన్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. రుద్రవరం మండలం చిలకలూరి నుంచి నంద్యాలకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను అదే మార్గంలో హైదరాబాదుకు వెళ్తున్న కారు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో కారు, ఆటో పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడ్డాయి. ఆటోలో ప్రయాణిస్తున్న వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండలం, ఎర్రముక్కలపల్లె లక్ష్మీదేవి (60), ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల, నంద్యాల మండలం అయ్యలూరికి చెందిన చెందిన మహమ్మద్‌వలి, బాలకృష్ణుడు, మహబూబ్‌బాషా, కృష్ణయ్య, పీరమ్మ, కాదరబాషాలకు గాయాలయ్యాయి. వీరిని 108లో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీదేవి కోలుకోలేక మృతి చెందింది. మృతురాలు నరసింహ స్వామి పార్వేట కొనసాగే గ్రామాల్లో బొమ్మలు విక్రయించేది. వాటిని నంద్యాలలో కొనుగోలు చేసుకొనేందుకు ఆటోలో వెళ్తూ మృత్యువాత పడింది. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కారులో ఉన్న ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు.

బతుకు బాటలో..

నల్లమల అటవీ ప్రాంతంలో ఓ లారీ డ్రైవర్ ఆకస్మికంగా మృతి చెందాడు. ఆత్మకూరు మండలం రామాంతపురానికి చెందిన శేషన్న (43) లారీ డ్రైవర్‌గా పని చేస్తూ విజయవాడలో నివాసముంటున్నాడు. సిమెంట్ లోడ్‌తో నంద్యాలకు వస్తూ పచ్చర్ల దిగువ మెట్ట మధ్య లారీ స్టీరింగ్‌పై పడి మృతి చెంది ఉన్నాడు. గుండెపోటుతో మరణించి ఉంటాడని పోలీస్‌లు అనుమానిస్తున్నారు. మృతుడి భార్య లక్ష్మీభవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఎస్‌ఐ ఉద్యోగాలకు నేడు ప్రాథమిక పరీక్ష

- కర్నూలు పరిసర ప్రాంతాల్లో 39 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 19,800 మంది అభ్యర్థులు

కర్నూలు: పోలీసు శాఖలో ఎస్‌ఐ ఉద్యోగాల భర్తీకి ప్రాథమిక పరీక్ష నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండో పేపర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం కర్నూలు పరిసర ప్రాంతాల్లో 39 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి ఈ పరీక్షలకు రీజనల్ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 16,685 మంది పురుష అభ్యర్థులు, 3,115 మంది మహిళా అభ్యర్థులు కలిపి మొత్తం 19,800 మంది దరఖాస్తు చేసుకున్నారు. పోలీసు శాఖ ఫోర్త్ జోన్ (కర్నూలు రేంజ్) పరిధిలోని చిత్తూరు, అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాల్లో 105 ఎస్‌ఐ పోస్టులు, 1,270 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబర్ 25న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

పటిష్ట బందోబస్తు...

39 పరీక్షా కేంద్రాలను రూట్లుగా విభజించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద సీఐ, ఎస్‌ఐ స్థాయి అధికారులు బందోబస్తును పర్యవేక్షిస్తారు. డీఎస్పీ స్థాయి అధికారులను ఆయా రూట్లకు ఇన్‌చార్జిలుగా నియమించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తో పాటు అదనంగా గుర్తింపు కార్డు తీసుకురావలసి ఉంటుంది. బ్లాక్ లేదా బ్లూ బాల్‌పెన్ తెచ్చుకోవాలి.

నిమిషం ఆలస్యమైనా అనుమతించరు..

పరీక్ష కేంద్రాలకు గంట ముందే అనుమతిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని నిర్వాహకులు తెలిపారు. పరీక్ష సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని క్షేత్రస్థాయి అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.